సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 25 । జూన్ । 2023



రైళ్ల రద్దు కొనసాగింపు

డోర్నకల్ జంక్షన్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దును మరో ఏడు రోజులు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸



స్కూల్ బస్సులపై దాడులు

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలు పాటించని బస్సులపై కేసు నమోదు చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/22^0$

వాతావరణం

జిల్లాలో చల్లటి వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల తనిఖీ



మహబూబాబాద్ అర్బన్: కేయూ పరిధిలోని 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలు నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాలలో శనివారం తనిఖీ బృందం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజు మాట్లాడుతూ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీజెడ్సీ గ్రూప్‌లకు పరీక్షలు జరుగుతున్నాయని, ఉదయం, మధ్యాహ్నం గ్రూపుల వారీగా సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయన్నారు. అలాగే డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఒకరోజు ముందే పరీక్ష కేంద్రాన్ని సందర్శించాలి

- అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

మహబూబాబాద్: గ్రూపు 4 పరీక్షలు రాసే విద్యార్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని సందర్శించాలని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తెలిపారు. గ్రూపు 4 పరీక్షలకు జిల్లాలో 14,207 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని 46 కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు రావాలన్నారు. ఉదయం సెషన్‌కు 9.45 గంటలలోపు, మధ్యాహ్నం సెషన్‌కు 2.15 గంటల లోపు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. పరీక్షల సమయంలో సకాలంలో బస్సులు నడపాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.

సీఎంఆర్ డెలివరీ చేయకపోతే చర్యలు

- టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ప్రభాకర్‌రెడ్డి

మహబూబాబాద్: నిర్ణీత గడువులోపు రైస్‌మిల్లర్లు, సీఎంఆర్ రైస్‌ను డెలివరీ చేయకపోతే సంబంధిత మిల్లర్లపై చట్టరీత్యా చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ రబీ 2021-22, ఖరీఫ్ 2022-23 రైస్‌ను డెలివరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీసీఎస్ఓ నర్సింగరావు, సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 551/1లో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కొంత మంది బినామీ పేర్లతో కబ్జా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బోడ రమేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌సీయూ కేంద్రం ప్రారంభం



నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎస్ఎన్‌సీయూ) కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, హోంమంత్రి మహ్మద్‌అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రాష్ట్రంలోని 18 కేంద్రాలతో పాటు మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శనివారం వర్చువల్‌గా హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్‌రాజ్ మాట్లాడుతూ.. ఎస్ఎన్‌సీయూ కేంద్రంలో సూపర్ స్పెషలిస్టు నియోనేటాలజిస్ట్ వైద్యుడిచే 24 గంటల పర్యవేక్షణలో ఈ కేంద్రం కొనసాగుతుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 28 రోజుల వరకు ఎలాంటి సమస్య వచ్చినా నేయో నేటాలజిస్ట్ వైద్యులు ప్రత్యక్షంగా చూసి వైద్యాన్ని అందిస్తారన్నారు. దీని ద్వారా శిశు మరణాలు తగ్గించేందుకు ఈ కేంద్రం సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఎస్ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అయేషాబేగం, డీపీఓ రుక్ముద్దీన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సందడి

డోర్నకల్‌లో రాజుకుంటున్న రాజకీయ వేడీ

- విమర్శలు, నిలదీతలొచ్చినా ఆగని 'రెడ్యా' పర్యటన
- సీనియర్ నాయకులను కూడగట్టుకుంటున్న కాంగ్రెస్
- స్తబ్ధతలో కమలనాథులు



సాక్షి, మహబూబాబాద్: మరో నాలుగు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నగారా మోగనుంది. అప్పటి వరకు ఆగలేమంటున్నారు డోర్నకల్ నియోజకవర్గ నాయకులు. ముందస్తుగానే ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. దీంతో రోజురోజుకూ ఎన్నికల వేడి రాజుకుంటుంది. ముందుగానే రాజకీయ సందడి మొదలైంది. ప్రస్తుతం ఎమ్మెల్యేతోపాటు, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారితోపాటు కొత్తగా టికెట్ కోసం ప్రయత్నించేవారు ప్రజలతో మమేకం అవుతూ.. సీనియర్ నాయకుల మద్దతు కూడగట్టుకుంటున్నారు. అయితే ఈ రెండు పార్టీల్లో ఇంత పోటీగా ప్రచారం సాగుతున్నా.. భారతీయ జనతా పార్టీలో మాత్రం స్తబ్ధత నెలకొంది.

ప్రజల్లోకి బీఆర్ఎస్

పార్టీ అధినాయకత్వం ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ గడపగడపకూ బీఆర్ఎస్ అన్న విధంగా నియోజకవర్గం కలియతిరుగుతున్నారు. అంతకుముందు ఆత్మీయ సమ్మేళనాలతో పర్యటన మొదలైంది. దశాబ్ది ఉత్సవాలు ఒకవైపు గ్రామాల పర్యటన మరోవైపు అన్నట్లు సాగుతుంది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు తాను ఏం చేసింది. ఇంకా ఏం చేయాలనుకున్నది చెబుతూనే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. ఈసారి కూడా తననే ఆశీర్వదించాలని కోరుతున్నారు.

అడుగడుగునా విమర్శలు, నిలదీతలు

డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రెడ్యానాయక్ నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. దంతాలపల్లి మండలంలో ప్రారంభమైన పర్యటన నర్సింహులపేట మండలం పూర్తి చేసుకొని మరిపెడ మండలంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలు గ్రామాల్లో నిరసన సెగ తగిలింది. పలుచోట్ల మా గ్రామాలకు, తండాలకు ఏం చేశారని ప్రశ్నించారు. తాగునీరు, రోడ్డు సౌకర్యం లేదని కొందరు, దళిత బంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారా? అని మరికొన్ని చోట్ల ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు చోట్ల అసహనానికి గురై ప్రశ్నించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇంత జరిగినా.. తన పర్యటనను మాత్రం ఆపకుండా ముందుకు వెళ్తున్నారు. ఈ విషయంపై ఆయన అనుచరులు మాట్లాడుతూ.. నాయకుడు అయినప్పుడు లోటు పాట్లు ఉంటాయని, వాటిని సరిదిద్దుకొని ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ఈ పర్యటన దోహద పడుతుందని చెప్పడం గమనార్హం.

సమస్యలపై కాంగ్రెస్

ఒకవైపు ఎమ్మెల్యే వివిధ కార్యక్రమాల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు కూడా తామేమి తక్కువ కాదన్నట్లు ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఒక వైపు వర్గపోరు వెంటాడుతున్నా.. ఎవరికీ వారుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న రాంచంద్రనాయక్, నెహ్రూ నాయకులు చావులు, బతుకులు, పెళ్లిళ్లు, పేరంటాల పేరిట కార్యకర్తలతో మమేకం అవుతున్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు, రైతులను మోసం చేయడం, జాప్యం చేయడం వంటి సమస్యలపై కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. పార్టీ పిలుపు మేరకు ధర్నాలు, రాస్తారోకోలు, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు పార్టీ అంతర్గత సమావేశాలు పెట్టుకోవడం, కమిటీల ఏర్పాటు, కార్యకర్తల సమావేశంతో కార్యకర్తలను ఎన్నికల వైపు మళ్లించేలా ప్రయత్నం చేస్తున్నారు.

సీనియర్ నాయకుల మద్దతు కూడగడుతూ..

ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న డోర్నకల్ ఇప్పుడు బీఆర్ఎస్ ఖాతాలో పడింది. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు ఇక్కడి నాయకులు ఈ సారి ప్రతిష్టాత్మకంగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకోసం సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే రామసహాయం సురేందర్ రెడ్డి ఇప్పటికే నియోజకవర్గంలోని సీనియర్ నాయకులతో పలుమార్లు చర్చలు జరిపినట్లు తెలిసింది. అదేవిధంగా ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్పించడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఆయన ప్రభావంతో ఈ సారి డోర్నకల్ హస్తగతం చేసుకోవాలనే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఇటీవల డోర్నకల్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న రాంచంద్రనాయక్, ఆర్.సురేందర్‌రెడ్డితోపాటు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి నియోజకవర్గంపై చర్చించినట్లు తెలిసింది. ఇక బీజేపీలో మాత్రం స్తబ్ధత వాతావరణం నెలకొంది. కొత్తనాయకులు వస్తారా.. లేదా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతలు వస్తారా అనే ఆలోచనతో ఉందనే ప్రచారం జరుగుతుంది. ఇలా ఇప్పటి నుంచే నియోజకవర్గంలో పార్టీల హడాహుడి చూస్తుంటే.. ఎన్నికల వాతావరణం కన్పిస్తుంది.

30న మంత్రి కేటీఆర్ రాక!

గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ

- ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సుందరీకరణ పనుల్లో అధికారులు బిజీ





తుది దశకు చేరుకున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

మహబూబాబాద్: ఈ నెల 30న మానుకోటకు మంత్రి కేటీఆర్ రానున్నారు. ముందుగా గిరిజనులకు పోడుపట్టాల పంపిణీ అనంతరం మానుకోట మున్సిపాలిటీలో పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. దీంతో మున్సిపల్ అధికారులు మానుకోట మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తున్నారు. సుందరీకరణ పనులు ఇతర పనులు కూడా వేగవంతం చేసి అందంగా తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. మానుకోట మున్సిపాలిటీలో ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని కొత్త బజార్‌లోని పాత కలెక్టరేట్ సమీపంలో నాలుగు ఎకరాల్లో వైకుంఠదామం, పాత బజార్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం సమీపంలో ఎకరంన్నరలో వైకుంఠదామం ప్రారంభించనున్నారు. మిషన్ భగీరథ పథకం కింద మానుకోట మున్సిపాలిటీ వరకు రూ.44 కోట్లు కేటాయించగా ఆ పనులు 80 శాతం పూర్తి అయ్యాయి.

సుందరీకరణపై నజర్..

మంత్రి రాక సందర్భంగా మానుకోట మున్సిపల్ అధికారులు సుందరీకరణ పనులపై దృష్టి సారించారు. డివైడర్లకు కలర్స్, పాంటేన్‌ల మరమ్మతులతో పాటు సుందరీకరణ పనులు చేపట్టారు.

పోడు పట్టాల పంపిణీ

రాష్ట్రంలోని గిరిజనులకు ఈనెల 30 నుంచి గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ జరుగుతుందని మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ పట్టాలు పంపిణీ చేస్తారని, మానుకోట జిల్లాలో రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పోడు పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు.

సాగు పనులు ముమ్మరం

తొలకరి వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలు పొలం బాట పట్టారు. ఆరుతడిగా సాగుచేసే పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేసేందుకు కొన్ని చోట్ల దుక్కులు సిద్ధం చేస్తుండగా మరి కొన్ని చోట్ల విత్తనాలు విత్తడం ప్రారంభించారు.

– బయ్యారం



పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

రైతుల ముందస్తు అరెస్ట్

కేసముద్రం: ఏళ్ల తరబడిగా సాగుచేసుకుంటున్న తమ భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారుపాసు పుస్తకాలు అందించాలంటూ శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ ఆఫీస్ ముట్టడికి వెళ్తున్న కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన 9 మంది రైతులను పోలీసులు ముందస్తు జాగ్రత్తగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళన తర్వాత, తమకు ఇప్పటి వరకు కొత్త పాసు పుస్తకాలు అందలేదన్నారు. దీంతో రైతుబంధు, రైతు బీమా, బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామన్నారు. తమకు న్యాయం చేయాలంటూ హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ ఆఫీసుకు వెళ్తుండగా, పోలీసులు అడ్డుకుని అన్యాయంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారని వాపోయారు. అయితే నారాయణపురం గ్రామానికి చెందిన సుమారు 1,200 మంది రైతులకుగాను, ఇప్పటి వరకు 354 మందికి పాసుబుక్కులు వచ్చాయని, రైతుబంధు కింద వ్యవసాయ శాఖపోర్టల్‌లో నమోదు కాగా, వానాకాలం పెట్టుబడిసాయం కింద రూ.37,43,000లు రైతుల ఎకౌంట్‌లో పడనున్నట్లు ఏఓ వెంకన్న తెలిపారు. అదే విధంగా మరో 900 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించనున్నట్లు తహసీల్దార్ సాంబశివుడు తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో నారాయణపురం రైతులు

భూసేకరణపై అధికారుల విచారణ

- భూ నిర్వాసితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అధికారులతో రైతుల వాగ్వాదం

కురవి: కురవి–కోదాడ 365/ఏ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూ నిర్వాసితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం భూసేకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు సీరోలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విచారణ (అవార్డు ఎంక్వైరీ) కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. తాళ్లసంకీస, ఉప్పరిగూడెం, కాంపల్లి, మన్నెగూడెంకు చెందిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు సమావేశం తహసీల్దార్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 82.13 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ.. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు తమ భూముల వివరాలు, తప్పొప్పులు ఉంటే సరిచేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మన్నెగూడెంకు చెందిన డోర్నకల్ జెడ్పీటీసీ పాడిశెట్టి కమల భర్త బీఆర్ఎస్ నాయకుడు పాడిశెట్టి రామనాథం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే ధరకంటే అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణలో భాగంగా రైతుల వాంగ్మూలాలను అధికారులు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మన్నెగూడెం బీఆర్ఎస్ నాయకుడు రామనాథం, ఎంపీటీసీ కొండపల్లి విజయపాల్‌రెడ్డిలు జోక్యం చేసుకుని రైతుల నుంచి బలవంతంగా వాంగ్మూలాలు తీసుకోవడం సరికాదని అధికారులను ప్రశ్నించారు. దీంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అప్పటికే కొందరు రైతులు సంతకాలు చేసి ఇచ్చిన కాగితాలను తిరిగి అధికారుల నుంచి తీసుకుని చింపేశారు. దీంతో రైతులు దరఖాస్తులు ఇవ్వకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, జాతీయ రహదారుల డీఈ సూరిబాబు, ఏఈ హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రామనాథం

సగం సగమే..

సీడీఎఫ్ నిధుల పనులు పూర్తయ్యేదెప్పుడో?

- లోపించిన సంబంధిత అధికారుల పర్యవేక్షణ
- పనుల మాదిరిగానే బిల్లులు కూడా పెండింగ్‌లోనే..
- ప్రతీ సంవత్సరం నియోజకవర్గానికి రూ.3 కోట్లు

మహబూబాబాద్: జిల్లాలోని నియోజకవర్గాలకు కేటాయించే సీడీఎఫ్‌కు సంబంధించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని పనులు సంవత్సరాలు గడుస్తున్నా.. అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనులు ఆలస్యమవుతున్నాయి. దీంతో జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాలు అభివృద్ధిలో వెనకబడుతున్నాయి. ప్రతీ సంవత్సరం నియోజకవర్గానికి సీడీఎఫ్ (నియోజకవర్గ అభివృద్ధి నిధులు) కింద రూ.3 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయిస్తుంది.

మానుకోట నియోజకవర్గంలో..

- 2016-17లో 65 పనులు రూ.297.20 లక్షలు మంజూరు కాగా 62 పనులు పూర్తి కాగా రూ.274.80 లక్షలు విడుదల అయ్యాయి. మిగిలిన 3 పనులకు గాను రూ.22.46 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2017-18లో 91 పనులకు రూ.298.50 లక్షలు మంజూరు కాగా 75 పనులు పూర్తి కాగా రూ.242 లక్షలు విడుదలయ్యాయి. 16 పనులు అసంపూర్తిగా ఉండటంతో రూ.56.50 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి
- 2018-19లో 137 పనులకు గాను రూ.298.53 లక్షలు మంజూరు కాగా 95 పనులు పూర్తై రూ.222.41 లక్షలు విడుదలయ్యాయి. 42 పనులు పూర్తికాక రూ.76.12లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి
- 2019-20, 2021లో కరోనా ఎఫెక్ట్‌తో నిధులు లేవు
- 2021-22లో 60 పనులకు రూ.299.40 లక్షలు మంజూరు కాగా 55 పనులు పూర్తై రూ.228.87 లక్షలు విడుదలయ్యాయి. 5 పనులు పూర్తికాక రూ.70.53 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2022-23లో 50 పనులు రూ.239.53 లక్షలు మంజూరు కాగా 16 పనులు పూర్తి కాగా రూ.79.68 లక్షలు విడుదలయ్యాయి. 34 పనులు పూర్తి కాక రూ.159.85 లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

డోర్నకల్ నియోజకవర్గంలో..

- 2016-17 ఆర్థిక సంవత్సరంలో 225 పనులు మంజూరు కాగా రూ.298.47 లక్షలు మంజూరు కాగా 119 పనులు పూర్తయ్యాయి. రూ.273.23 లక్షలు విడుదల అయ్యాయి. ఇంకా ఆరు పనులు అసంపూర్తిగా ఉండటంతో రూ.25.24 లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి.
- 2017-18లో 142 పనులకు రూ.293.20 లక్షలు మంజూరు కాగా 138 పనులు పూర్తై రూ.262.48 లక్షలు విడుదల కాగా మిగిలిన నాలుగు పనులు పూర్తి కాకపోవడంతో రూ.30.72 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి
- 2018-19లో 150 పనులకు రూ.298. 49 లక్షలు మంజూరు కాగా 132 పనులు పూర్తి కాగా రూ.254.21 లక్షలు విడుదలయ్యాయి. మిగిలిన 18 పనులు పూర్తి కాక రూ.44.28 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి



- 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాలకు కరోనా ఎఫెక్ట్‌తో నిధులు బ్రేక్ చేశారు. ఆ నిధులు ఇతర వాటికి కేటాయించారు.
- 2021-22లో 70 పనులకు రూ.296.80 లక్షలకు గాను కేవలం 14 పనులు మాత్రమే పూర్తి అయి రూ.60.65 లక్షలు విడుదల కాగా మిగిలిన 56 పనులకు రూ.236.15లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి
- 2022-23లో 58 పనులకు రూ.286 లక్షలు మంజూరు కాగా 2 పనులు పూర్తై రూ.10 లక్షలు విడుదల కాగా మిగిలిన 56 పనులు అసంపూర్తిగా ఉండటంతో రూ.276 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. పైగా జిల్లాలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ కవిత కోటాలో కేటాయించిన అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు పూర్తి కాకపోవడంతో బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజలకు అవసరాలకు ఉపయోగపడే పనులు..

సీడీఎఫ్ నిధులతో ప్రజలకు ఉపయోగ పడే పనులు చేయాలి. వాటి నిబంధనల ప్రకారం పనులు చేయాల్సి ఉంది. రోడ్లు, డ్రైయినేజీలు, కాంపౌండ్ వాల్స్, కమ్యూనిటీ హాల్ ఇతర పనులు చేయవచ్చు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం తదితర కారణాలతోనే పనులు పూర్తి కాక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా 2016-17 నుంచి పూర్తికాని పనులు పూర్తి చేయించి నియోజకవర్గాలు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారికి విప్రచిత్తా, మహా వజ్రేశ్వరీ క్రమాల్లో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు శనివారం విప్రచిత్తాక్రమంలో, మహా వజ్రేశ్వరీక్రమంలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు నిత్యాహ్నికం, చతుఃస్థానార్చనాది పూజలు నిర్వహించారు. స్నపనమూర్తిని కాళీక్రమంలో విప్రచిత్తా అమ్మవారిగా, భోగభేరాన్ని షోడశీక్రమంలో మహా వజ్రేశ్వరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



ఎంజీఎంలో కాక్లియర్ సర్జరీల నిర్వహణపై సమావేశం

ఎంజీఎం: హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న కాక్లియర్ సర్జరీలను ఎంజీఎంలో నిర్వహించే దిశగా ఎంజీఎం పరిపాలనాధికారులు అడుగులు వేస్తున్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక అడియోలాజిస్ట్ ఎంజీఎం ఆస్పత్రికి వచ్చారు. కాక్లియర్ సర్జరీ నిర్వహించే ఏర్పాట్లపై ఎంజీఎం పరిపాలనాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో మంత్రి హరీశ్ రావు వరంగల్‌ను సందర్శించిన క్రమంలో ఎంజీఎంలో కాక్లియర్ సర్జరీ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించిన సందర్భంలో ఆస్పత్రిలో బేర మిషన్ అందుబాటులో లేదనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రికి బేర పరికరం సైతం అందుబాటులోకి రావడంతో ఈఎన్టీ విభాగంలో నిర్వహించే కాక్లియర్ సర్జరీని ఎంజీఎం సైతం త్వరలో చేపట్టాలనే ఉద్దేశ్యంతో అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈక్రమంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసర్జరీ నిర్వహించాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో సుమారు రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి సర్జరీలను సైతం ప్రభుత్వాస్పత్రిలోనే నిర్వహించనున్నారు.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా నిట్

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. నిట్ క్యాంపస్‌లో శనివారం స్వచ్ఛతా క్యాంప్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిట్‌ను స్వచ్ఛ క్యాంపస్‌గా, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను డస్ట్‌బిన్‌లో వేసేలా విద్యార్థులు, అధ్యాపకులు తోడ్పడాలని సూచించారు. ఏడాదిలో 100 గంటల పాటు క్యాంపస్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ నిట్ కోసం 300 మంది వలంటీర్లు నాలుగు గ్రూపులుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పోలీస్‌ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన


అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పోలీస్‌ అధికారులు

వరంగల్‌ క్రైం: సబ్‌ ఇన్‌స్పెక్టర్‌, కానిస్టేబుళ్ల తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఈనెల 14 నుంచి మొదలైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో 7706 మందికి అవకాశం రాగా 6663 మందివి పరిశీలించారు. దీనికి గాను 20 కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తు సమయంలో తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దుకునేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పరిపాలన విభాగానికి చెందిన ఏవో, సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌ గ్రీవెన్స్‌ వాయిదా

వరంగల్‌ క్రైం: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో ఈనెల 26(సోమవారం)వ తేదీన జరగాల్సిన పోలీస్‌ గ్రీవెన్స్‌ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు వరంగల్‌ పోలీస్‌ మిషనర్‌ ఏవీ రంగనాథ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం గ్రీవెన్స్‌ ఉంటుందని, ప్రజలు వినతులు అందించొచ్చని సీపీ తెలిపారు.

‘అనుమతి’..అసమ్మతి

విద్యుత్‌ శాఖలో వర్క్‌మెన్‌ కేడర్‌కే ‘ఫుల్‌టైమ్‌ అనుమతి’

- రాష్ట్ర ప్రధాన పోస్టులలో ఇతర కేటగిరీ ఉద్యోగులు
- యూనియన్‌కు రాష్ట్రంలో ఒక్కరికే అవకాశం
- గతంలో విద్యుత్‌ సంస్థల వారీగా యూనియన్‌కు ఒక్కరు..
- ఈ క్యాలెండర్‌ సంవత్సరంలో నిబంధనల్లో మార్పు
- ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న యూనియన్‌లు

విద్యుత్‌ శాఖలో ఓ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి.. ఆ యూనియన్‌ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరు కావడం, ఇతరత్రా యూనియన్‌ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. దీనిని ‘ఫుల్‌టైమ్‌ అనుమతి’ అంటారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. అటు యూనియన్‌ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్‌ సంస్థలు ‘ఫుల్‌టైమ్‌ అనుమతి’ ఇస్తాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క యూనియన్‌ నుంచి ఒక్కరికే అదీ వర్క్‌మెన్‌ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్‌’ అనుమతి ఇస్తామని విద్యుత్‌ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయంతో యూనియన్‌, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నేతల్లో అసమ్మతి నెలకొంది. -హన్మకొండ



ఒక్కో యూనియన్‌ నుంచి రాష్ట్రంలో ఒక్కరికే ‘ఫుల్‌టైమ్‌’

రాష్ట్రంలో టీఎస్‌ జెన్‌కో, టీఎస్‌ ట్రాన్స్‌కో, టీఎస్‌ దక్షిణ విద్యుత్‌ పంపిణీ మండలి, టీఎస్‌ ఉత్తర విద్యుత్‌ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్‌ సంస్థల నుంచి యూనియన్‌కు ఒక్కరు చొప్పున ‘ఫుల్‌టైమ్‌’ అనుమతి తీసుకునే వారు. ప్రస్తుతం 2023 క్యాలెండర్‌ సంవత్సరంలో ఒక్కో యూనియన్‌ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్‌ ఇవ్వాలని 2022 డిసెంబర్‌16న జరిగిన తెలంగాణ స్టేట్‌ పవర్‌ కంపెనీస్‌ కో ఆర్డినేషన్‌ మీటింగ్‌లో నాలుగు విద్యుత్‌ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదైని కంపెనీ నుంచైనా యూనియన్‌కు ఒక్కరు మాత్రమే ‘ఫుల్‌టైమ్‌’ అనుమతి తీసుకోవాలి.

‘ఫుల్‌టైమ్‌’ అంశం పక్కకు..

2023 క్యాలెండర్‌ సంవత్సరం సగం పూర్తయినా యూనియన్‌లు ఇప్పటికీ నిర్ధారణకు రాలేకపోయాయి. ఒక్క యూనియన్‌, రెండు అసోసియేషన్లు మినహా మిగతా సంఘాలు ఎటుతేల్చుకోలేక ‘ఫుల్‌టైమ్‌’ అంశాన్ని పక్కకు పెట్టినట్లు చర్చించుకుంటున్నారు.

వర్క్‌మెన్‌ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్‌’..

ఇదిలా ఉండగా వర్క్‌మెన్‌ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్‌’ ఇవ్వాలని విద్యుత్‌ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్‌ క్యాడర్‌ అంటే కింది స్థాయి ఉద్యోగులు. ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి.. ఫోర్‌మెన్‌ వరకు.. ప్రోవెన్షియల్‌ (మినిస్టీరియల్‌) స్టాఫ్‌లో అటెండర్‌ స్థాయి నుంచి.. సీనియర్‌ అసిస్టెంట్‌ స్థాయి వరకు వస్తారు. ఆ తరువాత స్థాయి వారు వర్క్‌మెన్‌ క్యాడర్‌ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్‌లకు వర్క్‌మెన్‌ క్యాడర్‌ పైస్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. వీరు ఇప్పటి వరకు ‘ఫుల్‌టైమ్‌’ అనుమతితో యూనియన్‌ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఇటీవలి నిర్ణయంతో వీరికి ‘ఫుల్‌టైమ్‌’ అవకాశం చేజారింది. ఉదాహరణకు టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ పరిధిలో హనుమకొండ సర్కిల్‌లో పని చేస్తున్న రెండు ప్రధాన యూనియన్‌లలో ఒక యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా, మరో యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీరు ఇరువురు జూనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌లుగా ఉద్యోగం చేస్తున్నారు. అయితే జూనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ క్యాడర్‌ గెజిటెడ్‌ ఆఫీసర్‌ స్థాయి కిందకు రాదు. దీంతో తాము వర్క్‌మెన్‌ క్యాడర్‌ పరిధిలోకి వస్తామని జూనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ల వాదన. వర్క్‌మెన్‌ క్యాడర్‌ దాటి ఆఫీసర్‌ క్యాడర్‌లోకి వెళ్లినందున వీరికి వర్క్‌మెన్‌ క్యాడర్‌ వర్తించదని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి.

తేల్చులేకపోతున్న యూనియన్లు

అయితే ఇప్పటి వరకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌ జెన్‌కోలో ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న మాతంగి శ్రీనివాస్‌, బీసీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌లో సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ముత్యం వెంకన్న, టీఎస్‌ పవర్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ జెన్‌కో నుంచి రామకృష్ణ మాత్రమే ‘ఫుల్‌టైమ్‌’ అనుమతి పొందారు. మిగతా యూనియన్‌లు, అసోసియేషన్లు ‘ఫుల్‌టైమ్‌’ అనుమతిపై ఎటు తేల్చులేక పోతున్నాయి.

ఒక్కరికి మాత్రమే ‘ఫుల్‌టైమ్‌’..

గతంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ యూనియన్‌-1104, టీఎస్‌ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ యూనియన్‌-327, టీఆర్‌వీకేఎల్‌, టీఎస్‌ పవర్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (టీఎస్‌ జెన్‌కో), టీఎస్‌ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌, స్టేట్‌ ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఓసీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ల నుంచి నాలుగు విద్యుత్‌ సంస్థల నుంచి నలుగురికి, రాష్ట్ర స్థాయిలో ఒక్కరికి చొప్పున ఒక్కో యూనియన్‌కు మొత్తం ఐదుగురు ఉద్యోగులు ‘ఫుల్‌టైమ్‌’ తీసుకునే వారు. ఈ లెక్కన నాలుగు యూనియన్‌లు, ఐదు వెల్ఫేర్‌ అసోసియేషన్‌ల నుంచి మొత్తం 45 మంది ఉద్యోగులు ‘ఫుల్‌టైమ్‌’ తీసుకునేవారు. వీరి సంఖ్య కుదించడంతో పాటు ఉద్యోగులు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యూనియన్‌, అసోసియేషన్‌ నుంచి రాష్ట్రానికి ఒక్కరికి మాత్రమే ‘ఫుల్‌టైమ్‌’ ఇవ్వాలని సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి.

రైళ్ల రద్దు కొనసాగింపు

డోర్నకల్‌: డోర్నకల్‌ రైల్వే జంక్షన్‌ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దును మరో ఏడు రోజులు పొడిగించారు. హైదరాబాద్‌, సికింద్రాబాద్‌ డివిజన్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ మరమ్మతుల కోసం డోర్నకల్‌ స్టేషన్‌ మీదుగా నడిచే భద్రాచలం రోడ్‌-విజయవాడ, విజయవాడ-భద్రాచలం రోడ్‌, కాజీపేట- విజయవాడ, విజయవాడ-కాజీపేట, భద్రాచలం రోడ్‌-బలార్షా, సిర్పూర్‌-భద్రాచలం రోడ్‌ రైళ్లను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశారు. ప్రస్తుతం రోలింగ్‌ కారిడార్‌ ప్రోగ్రాం పని నిమిత్తం మరోసారి ఈ రైళ్లను ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

21న మిస్సింగ్‌.. 22న విశాఖలో ప్రత్యక్షం

- సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి అదృశ్యంలో కొత్తకోణం


నూనావత్‌ వినయ్‌కుమార్‌

గూడూరు: మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం రాములుతండాకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి నూనావత్‌ వినయ్‌కుమార్‌ అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ నెల 21న (బుధవారం) రాత్రి కోల్‌కతా నుంచి విజయవాడ వరకు రైలులో వస్తూ అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా, పోలీసులు ఇతను 22న విశాఖపట్నంలోని ఓ బాయ్స్‌ హాస్టల్‌లో ఉన్నట్లు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. మిస్సింగ్‌ అయిన వ్యక్తి మరుసటి రోజు విశాఖపట్నంలో ఎలా తేలాడన్నది అంతుపట్టడం లేదు. వినయ్‌కుమార్‌ అదృశ్యంపై గత గురువారం విజయవాడకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి 10.26 నిమిషాలకు వినయ్‌కుమార్‌ తన తండ్రి సదాశివుడితో ఫోన్‌లో మాట్లాడిన టైం ఆధారంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కటక్‌..బోజ్‌పూర్‌ రైల్వే మార్గంలో పోలీసులు ట్రాక్‌ వెంట తనిఖీ చేపట్టినా ఎలాంటి ఆధారం కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

పది రోజులు హాస్టల్‌లోనే ఉన్నాడు..

బుధవారం రాత్రి కటక్‌..బోజ్‌పూర్‌ రైల్వే మార్గంలో రాత్రి వినయ్‌కుమార్‌ అదృశ్యమైనట్లు భావిస్తున్న పోలీసులకు అతని సెల్‌ఫోన్‌ కాల్‌ డాటా ఆధారంగా ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్‌ విశాఖపట్నంలోని 7 హిల్స్‌ అనే ఓ బాయ్స్‌ హాస్టల్‌ పరిధిలో వినయ్‌కుమార్‌ సెల్‌నంబర్‌ పనిచేసినట్లు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి శనివారం ఉదయం రైల్వే పోలీసులతో విశాఖపట్నంలోని ఆ హాస్టల్‌ చేరుకున్న కుటుంబ సభ్యులు.. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఇరువురు కలిసి 7 హిల్స్‌ హాస్టల్‌ యజమాని, సిబ్బందితో వినయ్‌కుమార్‌పై ఆరా తీశారు. వారు ఆ పేరు గల వ్యక్తి పది రోజులుగా ఉన్నది నిజమేనని, రెండు రోజుల క్రితం బయటకు వెళ్లాడని, తిరిగి 22వ తేదీన వచ్చి మళ్లీ బ్యాగ్‌ తీసుకొని వెళ్లాడని చెప్పారు. అతను బయటికి వెళ్తున్నట్లు సీసీ కెమెరా ఫుటేజ్‌లో గుర్తించారు. రైలులో వస్తూ పడిపోయాడనుకున్న వ్యక్తి, తెల్లవారే విశాఖపట్నం ఎలా వచ్చాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. పది రోజులుగా హాస్టల్‌లో ఉన్న వాడు కోల్‌కతా నుంచి విజయవాడకు వస్తున్నట్లు తల్లిదండ్రులను ఎందుకు నమ్మించాడు.. అసలు సెల్‌ఫోన్‌ ఎందుకు స్విచ్చాఫ్‌ చేశాడు.. ఈ అదృశ్యం వెనకాల దాగి ఉన్న మిస్టరీ అంతుచిక్కడం లేదు. ఇదిలా ఉండగా ఐదు నెలల క్రితం ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న వినయ్‌కుమార్‌ ఏమైనా డిప్రెషన్‌లోకి వెళ్లాడా.. అసలు బతికే ఉన్నాడా, లేక ఎవరైనా కిడ్నాప్‌ చేశారా అన్నది మండలంలో చర్చనీయాంశంగా మారింది.

28న వరంగల్‌ డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్‌ డీసీసీబీ మహాజన సభ ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి చింతలపూడి చిన్నారావు శనివారం తెలిపారు. డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన హనుమకొండ నక్కలగుట్టలోని పావడమ్స్‌ బ్లూ కాన్ఫరెన్స్‌ హాల్‌లో మహాజన సభ జరుగుతుందన్నారు. 28న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు ఉమ్మడి వరంగల్‌ జిల్లా పరిధిలోని పీఏసీఎస్‌ చైర్మన్‌లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన ఆయా సహకార సంఘాల చైర్మన్లు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్‌ మృతి


ఆత్మకూరు: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ హెడ్‌కానిస్టేబుల్‌.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన కొర్ర భీమ్‌సింగ్‌(54) జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భీమ్‌సింగ్‌ కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. రూ.25 లక్షలు అప్పు చేయగా రూ. 6 లక్షల వరకు తిరిగి చెల్లించాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలనే బెంగతో గురువారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నగరంలోని ఓ ఆస్పత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య వసంత శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమార్‌ తెలిపారు.

సీజీఆర్‌ఎఫ్‌ వరంగల్‌ చైర్మన్‌గా వేణుగోపాలచారి


వేణుగోపాలచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరంగల్‌ ఎస్‌ఈ మధుసూదన్‌, డీఈ (టీ)ఆనందం

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్‌) వరంగల్‌ చైర్మన్‌గా వేణుగోపాలచారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌గా కొనసాగిన పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో టీఎస్‌ఈఆర్‌సీ వేణుగోపాలచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఆర్‌ఎఫ్‌ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేణుగోపాలచారిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఐఎంఎస్‌ ఇన్‌చార్జ్‌ల నియామకం


ఉస్మాన్‌


ఇస్మాయిల్‌

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని మైనార్టీ గురుకులాల రికార్డులు, స్టాక్‌ మేనేజ్‌మెంట్‌ తదితర రికార్డుల తనిఖీ కోసం ఇన్వెంటరీ మాడ్యూల్‌ సిస్టమ్‌(ఐఎంఎస్‌) ఇన్‌చార్జ్‌లుగా హనుమకొండ(బీ1), మహబూబాబాద్‌(బీ1) గురుకులాల డిప్యూటీ వార్డెన్‌లు మహ్మద్‌ ఉస్మాన్‌, మహ్మద్‌ ఇస్మాయిల్‌ను నియమిస్తూ సెక్రటరీ షఫీయుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 16 గురుకుల పాఠశాలలు, కళాశాలల డిప్యూటీ వార్డెన్‌లకు రికార్డ్‌ మెయింటనెన్స్‌, స్టాక్‌ రిజిస్టర్లు, ఆన్‌లైన్‌ రికార్డ్‌ అంశాలపై శిక్షణ ఇస్తారు. ఐఎంఎస్‌లుగా నియామకమైన ఇద్దరిని ప్రిన్సిపాళ్లు, డిప్యూటీ వార్డెన్‌లు అభినందించారు.

శరీరదాన అంగీకారపత్రాల అందజేత


అంగీకార పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్‌ ప్రతినిధులు

ఎంజీఎం : గొప్ప సంకల్పంతో తమ మరణానంతరం శరీరదానం చేస్తామని అంగీకరించిన పలువురు.. ఆ పత్రాలను శనివారం శరీర అవయవదాతల అసోసియేషన్‌ ప్రతినిధి, కేఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్‌ పద్మజకు అందించారు. ఈ సందర్భంగా శరీర అవయవదాతల అసోసియేషన్‌ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే వారి మృతదేహాలను మెడికల్‌ కాలేజీకి అప్పగించాలన్నారు. తద్వారా విద్యార్థులు వైద్య విద్య నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం శరీర దానం చేస్తామని అంగీకారం పత్రం అందజేసిన 40 మందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌ రావు యాదవ్‌, డాక్టర్‌ రాజేంద్రప్రసాద్‌, కేదారి పాల్గొన్నారు.

ఈ-నామ్‌ సదస్సులో మార్కెట్‌ అధికారులు..

వరంగల్‌: గోవాలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఈ-నామ్‌ జాతీయ సదస్సులో వరంగల్‌ డీడీఎం రాజునాయక్‌, వరంగల్‌ మార్కెట్‌ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్‌లో పాల్గొన్నారు. మూడు రోజులు జరిగిన ఈసదస్సులో ఈ-నామ్‌ అమలుపై ఎదురవుతున్న ఇబ్బందులను మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌ లక్ష్మీబాయి.. జాతీయ స్థాయి అధికారులకు వివరించినట్లు డీడీఎం రాజునాయక్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లాలో పత్తి, వరంగల్‌, ఖమ్మం జిల్లాలో మిర్చి కొనుగోళ్లలో ఈ-నామ్‌ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. సదస్సులో తెలంగాణ నుంచి రాష్ట్ర సహాయ సంచాలకుడు లక్ష్మణుడు పాల్గొన్నట్లు తెలిపారు.

స్కూల్‌ బస్సులపై రవాణాశాఖ దాడులు

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు
- నిబంధనలు పాటించని బస్సులపై కేసు
- గీతాంజలి స్కూల్‌ బస్సులపై చర్యలు
- వివరాలు వెల్లడించిన ఎంవీఐ రవీందర్‌


వివరాలు వెల్లడిస్తున్న ఎంవీఐ రవీందర్‌

ఖిలా వరంగల్‌ : ఫిట్‌నెస్‌ లేని స్కూల్‌ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వరంగల్‌ జిల్లా ఆర్టీఓ అఫ్రీన్‌ సిద్దీఖీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం వరంగల్‌ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రహదారులపై కళాశాల, స్కూల్‌ బస్సులను ఆపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌, రిజిస్ట్రేషన్‌ పత్రాలు పరిశీలించారు. అలాగే బస్సుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను అదుపు చేసే అగ్నిమాపక యంత్రాల సిలిండర్‌ అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. నర్సంపేటలో గీతాంజలి డీజీ స్కూల్‌ బస్సు వెనుక అద్దం లేకపోవడంతో అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. బస్సుకు మిర్రర్‌ బిగించిన తర్వాత విద్యార్థులను తరలింపునకు అనుమతించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవీందర్‌ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్కూల్‌ బస్సులను నడపాలన్నారు. ఫిట్‌నెస్‌ ఉన్న స్కూల్‌ బస్సుల్లో విద్యార్థులను తరలించాలని, లేనిపక్షంలో బస్సులను సీజ్‌ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల 30 వరకు విస్తృతంగా దాడులు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐ వెంకన్న, ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌కు అడ్డు వచ్చిన వానరం..

- కిందపడిన దంపతులు
- కోమాలోకి భార్య.. పరిస్థితి విషమం
- కొత్తపోచారంలో ఘటన


చికిత్స పొందుతున్న రూతమ్మ

గార్ల : దంపతులు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో వానరం అడ్డువచ్చింది. దీంతో సడన్‌ బ్రేక్‌ వేయగా.. భార్య బైక్‌ నుంచి పడి తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లి ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతోంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గార్ల మండలం కొత్తపోచారం గ్రామానికి చెందిన 4వ వార్డు సభ్యురాలు తిప్పారపు రూతమ్మ భర్త హనుమంతరావుతో కలిసి బైక్‌పై శుక్రవారం గార్లకు వచ్చారు. అనంతరం స్వగ్రామం వెళ్తుండగా గోపాలపురం సమీపంలో బైక్‌కు కోతి అడ్డొచ్చింది. దీంతో హనుమంతరావు సడన్‌ బ్రేక్‌ వేయగా వెనుక కూర్చున్న రూతమ్మ రోడ్డుపై పడింది. తల వెనుక భాగంలో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కోమాలోకి వెళ్లింది. క్షతగాత్రురాలిని హుటాహుటిన 108 ద్వారా ఖమ్మం తరలిచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా, తమది నిరుపేద కుటుంబమని, కనీసం వైద్య ఖర్చులకు కూడా డబ్బు లేదని, దాతలు స్పందించి తన భార్యకు ప్రాణభిక్ష పెట్టాలని హనుమంతరావు వేడుకుంటున్నాడు. దాతలు 9573073641 నంబర్‌కు ఫోన్‌ పే చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ‘ఓ’ సిటీ ప్లాట్లకు వేలం

కరీమాబాద్‌: వరంగల్‌ ‘ఓ’ సిటీలోని ‘కుడా’కు చెందిన ప్లాట్లకు ఆదివారం వేలం నిర్వహిస్తున్నట్లు ‘కుడా’ వైస్‌ చైర్మన్‌ రిజ్వాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌-నర్సంపేట రోడ్డులో ఉన్న 36 నివాసయోగ్య, 6 వాణిజ్యపర ప్లాట్లను వేలంలో విక్రయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈఎండీ ద్వారా రూ. 25 వేలు, రూ. 50 వేల చొప్పున చెల్లించి టోకెన్‌ పొంది వేలంలో పాల్గొనాలన్నారు.